

సైబర్ టాస్క్

కేటుగాళ్ల కొత్త ఎత్తుగడలు

- రేటింగులు... లైకుల పేరిట మోసం
- ఒక్కో టాస్క్‌కు రూ.50 నుంచి రూ.150
- టాస్క్‌ల్లో పెట్టుబడి పెడితే లాభాలంటూ బురిడీ
- నమ్మించి రూ.లక్షల్లో కాజేస్తున్న నేరగాళ్లు
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం సైబర్ వలలో

అమీన్‌పూర్‌లోని సాయి భగవాన్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పార్ట్‌టైం జాబ్ పేరిట ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఓ లింకు ఓపెన్ చేసి టాస్క్‌లు పూర్తిచేశాడు. ఇలా విడతల వారీగా మొత్తం రూ.11.10లక్షలు పెట్టుబడి పెట్టాడు. టాస్క్‌లు పూర్తి చేసిన తర్వాత డబ్బు తిరిగి రాలేదు. కిష్టారెడ్డిపేటకు చెందిన మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇలాగే రూ.1.17లక్షలు పోగొట్టుకున్నాడు.

గుమ్మడిదల మండలం అన్నారం గ్రామానికి చెందిన ఓ నిరుద్యోగికి వాట్సాప్ ద్వారా ఉద్యోగం ఉందంటూ మెసేజ్ వచ్చింది. ఆ ఉద్యోగంతో పాటు పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి విడతల వారీగా మొత్తం రూ.1.78 లక్షలు పెట్టుబడిగా పెట్టించి ముఖం చాటేశారు.

అమీన్‌పూర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వచ్చిన సందేశానికి ఆకర్షితుడై ఓ బిజినెస్ డెవలప్‌మెంట్ యాప్‌లో చేరాడు. టాస్క్‌లు పూర్తి చేస్తే అధిక లాభాలు ఇస్తామని ఆశచూపి సైబర్ నేరగాళ్లు అతని నుంచి రూ.10.25 లక్షలు కాజేశారు.

ఇలా టాస్క్‌లు, పెట్టుబడి అంటూ సైబర్ కేటుగాళ్లు ఏకంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులనే బురిడీ కొట్టించిన ఘటనలివి. ఇటీవల ఎక్కువగా జరుగుతున్న ఈ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.

సంగారెడ్డి క్రైం, మే 22 : 'మీ వద్ద స్మార్ట్ ఫోన్ వుంటే చాలు... ఇంటి వద్దనే ఉంటూ లక్షల్లో సంపాదించండి... ఇందుకు మీరు ఈ లింక్‌లను క్లిక్ చేయండి చాలు' అనే ప్రకటనలు సోషల్ మీడియా మాధ్యమాల్లో ఇటీవల ఎక్కువగా కనిపిస్తున్నాయి. వాటిని క్లిక్ చేశారో అంతే సంగతి. యాప్‌లో పెట్టుబడి, టాస్క్‌లు పూర్తి చేస్తే లక్షల్లో డబ్బు. కేవలం ఫొటోలకు, వీడియోలకు లైక్ కొట్టి వేలల్లో సంపాదించొచ్చు అంటూ సైబర్ నేరగాళ్లు వల పన్నుతున్నారు. లక్షల్లో డబ్బును కాజేస్తున్నారు. ఇలా సంగారెడ్డి జిల్లాలో గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు 323 సైబర్ కేసులు నమోదయ్యాయి. బాధితులు సైబర్ నేరగాళ్ల చేతిలో రూ.22.71 కోట్ల వరకు మోసపోయారు. ఇందులో సకాలంలో బాధితులు ఫిర్యాదు చేయగా రూ.3.62 కోట్ల వరకు ఫ్రీజ్ చేయడం జరిగింది.

ఇలా కొట్టేస్తున్నారు..

కేవలం ఫొటోలకు, వీడియోలకు లైక్ కొట్టడమే... మీ పని అంటూ సందేశాలతో గుర్తు తెలియని ఫోన్ నంబర్ నుంచి వాట్సాప్‌లకు మెసేజ్‌లు వస్తున్నాయి. ఈ వాట్సాప్‌లో ఈ కామర్స్‌ల పేరిట ఉన్న యాప్‌లలోని వస్తువులకు రేటింగ్ ఇవ్వడం, హోటళ్లు, రెస్టారెంట్లు, సినిమాహాళ్లకు రేటింగ్ ఇవ్వడం, వాట్సాప్‌లలో యూజర్లకు పంపే మెసేజ్‌లలో లింకు ఓపెన్ చేసి ఫాలో అవ్వాలని, యూట్యూబ్ వీడియోలకు లైకులు ఇవ్వాలని, ఎన్ని లైకులు చేస్తే అన్ని టాస్క్‌లు పూర్తి చేసినట్టని పేర్కొంటూ వాటిని స్క్రీన్‌షాట్ తీసి తిరిగి తమకు పంపాలంటారు. ఒక్కో టాస్క్‌కు రూ.50 నుంచి రూ.250 వరకు ఇస్తామని, అలా టాస్క్‌లు పూర్తి చేసిన తర్వాత డబ్బు పంపడానికి గుగూల్ పే, ఫోన్ పే లింకులు ఇవ్వాలని, లేదా బ్యాంకు అకౌంట్‌ను ఇవ్వాలని కోరుతుంటారు. ముందుగా ఇచ్చిన టాస్క్ పూర్తిచేసిన తర్వాత మీ బ్యాంకు ఖాతాలలో డబ్బు జమ చేస్తామని పేరు, వయస్సు, వృత్తి, ఫోన్‌నంబరు ఇతర పూర్తి వివరాలు సేకరిస్తారు. అమాయకులను నమ్మించడానికి గూగుల్ పే, ఫోన్‌పేల ద్వారా మొదటగా వందల రూపాయలు పంపుతారు. తర్వాత సదరు వ్యక్తి బ్యాంకులో ఉన్న మొత్తం డబ్బును సైబర్ నేరగాళ్లు కొట్టేస్తున్నారు.



మూడేళ్లలో సైబర్ క్రైమ్ కేసులు	
సంవత్సరం	కేసులు
2021	35
2022	217
2023	323

చిన్న మొత్తాలతో ప్రారంభించి..

యాప్, టాస్క్‌లు, ట్రేడింగ్ అంటూ పెట్టుబడి పెట్టించి సైబర్ కేటుగాళ్లు అందినకాడికి ఊడుస్తున్నారు. మొదట చిన్న మొత్తంలో పెట్టిన పెట్టుబడికి లాభం చూపించగా, ఆశతో పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టిన సమయంలో కాజేస్తున్నారు. అమీన్‌పూర్ పరిధిలోని భవానీపురానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదనపు ఆదాయం సంపాదించుకోవచ్చని ఇలానే ఓయాప్‌లో పెట్టుబడి పెట్టాడు. మొదట యాప్‌లో రూ.2 వేలు పెట్టుబడి పెట్టగా లాభాలు చూపించారు. ఆ తర్వాత మొత్తం రూ.15.37లక్షలు యాప్‌లో జమ చేశాడు. తన లాభం, అసలు డబ్బు చెల్లించాలని కోరగా యాప్ నుంచి స్పందన లేకుండాపోయింది. అమీన్‌పూర్ పరిధిలోని హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన స్టాక్ ట్రేడర్ ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ చేస్తుండేవాడు. ఆయన సైబర్ వలకు చిక్కాడు. ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లో రూ.27.71 లక్షలు జమ చేశాడు. కొన్ని రోజుల తర్వాత సదరు యాప్ మార్ఫింగ్ లోగోతో ఉన్నట్టు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే అధికం

సైబర్ నేరగాళ్లు విసురుతున్న వలలో అనేక మంది ఉద్యోగులు, నిరుద్యోగులు చిక్కుకుంటున్నారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా.. పార్ట్‌టైం జాబ్‌తో అదనంగా డబ్బు సంపాదించవచ్చన్న ఆశతో సైబర్ నేరగాళ్ల బారిన పడి లక్షల్లో నష్టపోతున్నారు. జిల్లాలోని అమీన్‌పూర్, పటాన్‌చెరు, రామచంద్రపురం తదితర పట్టణాల్లోనే అధికంగా మోసపోయిన బాధితులు ఉన్నారు.

అధిక లాభాలంటే నమ్మొద్దు



మొబైల్ ద్వారా వచ్చే అనుమానాస్పద మెసేజ్‌లకు స్పందించవద్దు. అధిక లాభాలు ఇస్తామని ఆశ చూపిస్తే వాటిలో మోసం ఉన్నట్టు గ్రహించాలి. ఫ్రీ గిఫ్టులు, లాటరీల పేరుతో వచ్చే ప్రకటనలను నమ్మొద్దు. ఓఎల్ఎక్స్ వంటి వెబ్‌సైట్‌లలో వస్తువులను అమ్మే సమయంలో ఎవరైనా వ్యక్తి క్యూఆర్‌కోడ్ పంపి స్కాన్‌చేసి డబ్బు పొందండి అంటే అది మోసమేనని గుర్తించాలి. అలాగే వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు అపరిచిత వ్యక్తులు ఆన్‌లైన్‌లలో అడుగుతున్నాడంటే దాని అర్థం మీ వద్ద నుంచి డబ్బు కాజేయడానికేనని అర్థంచేసుకోవాలి. ఒకవేళ సైబర్ నేరగాళ్ల బారినపడి మోసపోతే వెంటనే 155260 లేదా 100కు ఫోన్ చేయాలి. లేదా ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. డబ్బు పోగొట్టుకున్న వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బును ఫ్రీజ్‌చేయడానికి సాధ్యమవుతుంది.

- చెన్నూరి రూపేష్, ఎస్పీ



బండెనక బండి..

అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్ మల్లన్న స్వామి ఆలయం జాతర ఉత్సవాలలో భాగంగా బుధవారం ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. స్థానికులే కాకుండా మండలంలోని ముస్లాపూర్, టేక్మాల్ మండలంలోని పలు గ్రామాల భక్తులు ఎడ్లబండ్లను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొక్కులను తీర్చుకున్నారు.

- అల్లాదుర్గం, మే 22

అమీన్‌పూర్ చెరువు మురుగుశుద్ధికి రూ.16కోట్లతో అంచనా

మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి



వినతిపత్రం అందజేస్తున్న చెరువు ముంపు బాధితులు

పటాన్‌చెరు, మే 22 : అమీన్‌పూర్ పెద్దచెరువులోకి ప్రవహిస్తున్న మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాల శుద్ధికి రూ.16 కోట్లతో అంచనాలను రూపొందించామని అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పెద్దచెరువు ప్లాట్ల ముంపు బాధితుల జేఏసీ సభ్యులు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. చెరువులో కాలుష్య వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకుని తూముల ద్వారా నిల్వ నీటిని దిగువకు వదలాలని బాధితులు కోరారు. త్వరలోనే అమీన్‌పూర్ చెరువు ముంపు బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతస్థాయి అధికారుల సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ చెరువు నీటి ముంపుతో సుమారు ఐదువేల ఇళ్ల స్థలాలు మునిగాయని ఆవేదన వ్యక్తంచేశారు. తమ పరిస్థితిపై రాష్ట్ర మంత్రులు, కలెక్టర్, ఉన్నతాధికారులు సానుకూలంగా స్పదించారన్నారు. మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో జేఏసీ చైర్మన్ చిరునామా సత్యనారాయణ, సభ్యులు బ్రహ్మానందరావు, పూర్ణచందర్‌రావు, రాంబాబు, వెంకటప్పయ్య, కేఎల్.మోహన్, ఎంఎస్.బాబు, పుండరీకాక్షశర్మ, రఘురాం, కోటేశ్వరావు, సాయిబాబు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

- రేపు ఉదయం 11 గంటలకు ప్రారంభం
- సంగారెడ్డి జిల్లాలో 2,420 మంది విద్యార్థులు
- ఏడు పరీక్ష కేంద్రాలు సిద్ధం
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

సంగారెడ్డి రూరల్, మే 22 : పాలిసెట్-2024కు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ, వెటర్నిటీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 24న పాలిసెట్ నిర్వహించనున్నారు. ఇందుకు గాను సంగారెడ్డి పట్టణంలో ఏడు కేంద్రాలు ఏర్పాటు చేయగా 2,420 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ పరీక్షలు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగనున్నాయి. అయితే విద్యార్థులు ఉదయం 9.30 గంటల లోపు పరీక్షల కేంద్రాలకు చేరుకోవాలని, ఉదయం 10 గంటల నుంచి కేంద్రాల్లోనికి అనుమతించనున్నారని అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల దాటిన తరువాత నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించేది లేదని స్పష్టం చేస్తున్నారు. పాలిసెట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తున్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌పై విద్యార్థి ఫొటో ప్రింట్ కాని వారు పాస్‌పోర్ట్ సైజు ఫొటోని అతికించుకుని, ఎవరైనా గజిటెడ్ అధికారి ధ్రువీకరిస్తూ సంతకం చేయించాలని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్‌తో పాటు, హెచ్‌బీ పెన్సిల్, బ్లూ, బ్లాక్ పాయింట్ పెన్, ఎరేజర్ తెచ్చుకోవాలని, సెల్‌ఫోన్, క్యాలిక్యులేటర్, రిస్ట్ వాచ్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రంలోనికి అనుమతించేది లేదని అధికారులు తెలియజేశారు. పరీక్ష రాసే సమయంలో మధ్యలో టాయిలెట్‌కు వెళ్లేందుకు కూడా అనుమతించరని విద్యార్థులు తగు జాగ్రత్తలతో పరీక్షలకు సన్నద్ధం కావాలని అధికారులు పేర్కొన్నారు.



సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

10 గంటల వరకే చేరుకోవాలి



విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 10 గంటలకు వరకు చేరుకోవాలి. 11 గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లో లోనికి అనుమతించరు. పరీక్షకు కావాల్సినవి ఒక రోజు ముందే సమకూర్చుకుని సిద్ధం కావాలి. పాలిసెట్ పరీక్ష కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం.

-శ్రీనివాస్‌రావు,
సంగారెడ్డి పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్

రేపటి నుంచి ఇంటర్ సప్లమెంటరీ

- మెదక్ జిల్లాలో 22 పరీక్ష కేంద్రాలు
- నిమిషం ఆలస్యమైన అనుమతి లేదు
- ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ

మెదక్ అర్బన్, మే 22 : రేపటి నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 22 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రథమ సంవత్సరంలో 3,812 మంది, ద్వితీయ సంవత్సరంలో 2,298 మంది మొత్తం 6,110 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, 22 మంది సీఎస్, 22 డీవోలతోపాటు ఒక ఫ్లయింగ్‌స్క్వాడ్ టీం, 4 సిట్టింగ్ స్క్వాడ్, 4 కస్టడీయన్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. నిమిషం నిబంధన అమలులో ఉందని, విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎగ్జామ్ కమిటీ సభ్యులు శశిధర్, అశోక్, ఫ్లయింగ్ స్క్వాడ్ నరేందర్, ప్రిన్సిపల్స్ రవీందర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్ మార్కెట్‌లో విక్రయిస్తున్న మామిడి పండ్లు



డబ్బాలలోని మామిడి పండ్లు

తీపి పంచని మామిడి

- పెట్టుబడులు ఎక్కువ.. ఆదాయం తక్కువ
- కాత సమయంలోనే తోటలు విక్రయం
- విక్రయించిన ధరకు, మార్కెట్ ధరకు భారీ వ్యత్యాసం
- దళారుల చేతుల్లో దగాపడుతున్న మామిడి రైతులు

7లో





విద్యార్థులు సెలవుల్లో పాఠశాలలో నేర్చుకున్న విద్యను మర్చిపోకుండా ఉండేందుకు ఓ ప్రధానోపాధ్యాయుడు వినూత్న ఆలోచన చేశాడు. గ్రామంలో విద్యార్థులు ఆడుకునే ప్రధాన కూడళ్లలో సొంత ఖర్చుతో గోడలపై తెలుగు, ఇంగ్లీష్ వర్ణమాల, ఒత్తులు, గుణింతాలు, అంకెలతో కూడిన వాల్ పెయింటింగ్ రాయించారు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని వల్లభపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మెతుకు పరమేశ్వర్‌రెడ్డి ఈ ప్రయత్నం చేశారు.

- చేగుంట, మే 22

ఈసీ మార్గదర్శకాల ప్రకారం ఓట్ల లెక్కింపు

- ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మే 22 : ఎన్నికల కమిషన్(ఈసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల అధికారి, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులకు బుధవారం ఓట్ల లెక్కింపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశామన్నారు. మొత్తం 326 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చామని వెల్లడించారు. కౌంటింగ్‌లో 14 టేబుళ్లు ఉంటాయని దానికనుగుణంగా రెండో శిక్షణ కార్యక్రమంలో అసెంబ్లీల వారీగా సిబ్బందిని కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు రాజు, పాండు, అశోక చక్రవర్తి, మాస్టర్ ట్రైనర్ కృష్ణకుమార్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలకు చెందిన కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లల్లో వేగం పెంచండి

సంగారెడ్డి రూరల్, మే 22 : ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని, వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి డివిజన్ పరిధిలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిల్లుల వద్ద ధాన్యం త్వరగా అన్‌లోడ్ చేయించాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. ఉదయమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, రోజు ఐదు లారీలు కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులను ఉపాధ్యాయులు దగ్గర ఉండి పూర్తిచేయించుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సంగారెడ్డి డివిజన్ కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్, మండల పరిషత్, ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు.



మామిడిపండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

ముగిసిన ఫల ప్రదర్శన

సంగారెడ్డి రూరల్, మే 22 : రైతుల సమస్యలను ఉద్యానవన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సమన్వయంతో పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి సూచించారు. సంగారెడ్డిలోని ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నిర్వహించిన ఫల ప్రదర్శన ముగింపునకు బుధవారం కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 15 వేల ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారని తెలిపారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌లో సుమారు 250 రకాల మామిడి పండ్ల సాగు చేసి అందుబాటులో ఉంచడం గొప్ప విషయమన్నారు. ఉద్యానవన శాఖ, ఫల పరిశోధన శాస్త్రవేత్తలు కలిసి రైతులకు మామిడి పండ్ల సాగులో అధిక దిగుబడులు వచ్చేలా జాగ్రత్తలు, సూచనలు అందించాలని తెలిపారు. అనంతరం రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి ఏడీహెచ్ శ్రీధర్, హెచ్‌వోలు సమంత, శైలజ, స్పందన, కీర్తి, ఫల పరిశోధన శాస్త్రవేత్తలు డా.హరికాంత్, డా.మాధవి, డా.మౌనిక, డా.నితీష్, ఏవో యుగంధర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో జాగ్రత్త..!

● రైతులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలి



మెదక్ కల్చరల్, మే 22: ప్రస్తుతం ఎండాకాలమైనా అకాల వర్షాలు ప్రజలను, రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. అయితే అకాల వర్షాల కారణంగా పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఆకాశం మేఘావృతమై, బలమైన ఈదురు గాలులు, వడగండ్లు పడుతున్నాయి. వర్షం పడేటప్పుడు ఆకాశంలో మెరుపులు, భయంకరమైన శబ్దాలతో అక్కడక్కడ పిడుగులు కూడా పడుతున్నాయి. అయితే వీటికి బలమైన అయస్కాంత శక్తితో కూడిన విద్యుత్ శక్తి ఉంటుంది. వీటి ప్రభావం వల్ల ఎక్కువగా రైతులు, వ్యవసాయ కూలీలే చనిపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో చెట్ల కింద కట్టేసి ఉన్న జంతువులూ కూడా చనిపోతున్నాయి. ఈ క్రమంలో పొలాల వద్ద ఉండే రైతులు, రైతు కూలీలు అప్రమత్తంగా ఉండాలి. వర్ష సూచన కనిపించినా, ఆకాశం మేఘావృతమైనా వెంటనే ఇళ్లకు బయలుదేరడం మంచిది. వర్షాలు వరుసగా కురుస్తుండడంతో ధాన్యం ఎండక రైతులు సతమవుతున్నారు. ఈ క్రమంలోనే ధాన్యం ఆరబెట్టేందుకు ఈ నెల 11న పెద్దశంకరంపేట మండలం రామోజీపల్లి గ్రామానికి చెందిన తండ్రి, కొడుకు వెళ్లగా ఒక్క సారిగా వర్షం రావడంతో చెట్టుకింద నిల్చున్నారు. ఆ సమయంలో వారిపై పిడుగు పడి మృతి చెందారు.

పిడుగు అంటే ఏమిటి?

మేఘాలలో ఉష్ణోగ్రత చాలా తక్కువగా ఉండడం వలన వర్షపు నీరు చిన్న చిన్న మంచు కణాలుగా విడిపోతుంది. అయితే విపరీతమైన గాలులు వచ్చినప్పుడు వీటి మధ్య రాపిడి జరిగి ఒక విద్యుత్ శక్తి విడుదలవుతుంది. ఇందులో పాజిటివ్ కణాలు తేలికగా ఉండటం వలన మేఘాల పైకి వెలుతుంటే, నెగటివ్ కణాల బరువు ఎక్కువగా ఉండి మేఘాల కిందకు వెళ్తాయి. అయస్కాంతంలో ఉత్తర, దక్షిణ ధ్రువాలు ఆకర్షించుకున్నట్లుగానే రెండు మేఘాలు దగ్గరగా వచ్చినప్పుడు పాజిటివ్, నెగటివ్ కణాలు ఆకర్షించుకొని ఆకాశంలో మెరుపులు వస్తుంటాయి. ఈ సమయంలో మేఘాలలో నెగటివ్ కణాలు భూమిలోని పాజిటివ్ కణాలు ఆకర్షిస్తుంటాయి. అప్పుడు భూమిపై ఎత్తుగా ఉండే చెట్లు, గుట్టలు, మనుషులు, సెల్ టవర్స్ ద్వారా రాపిడి జరిగి మెరుపులతో కూడిన పిడుగు పడుతుంది.

ఈ జాగ్రత్తలు పాటించాలి

వర్షాలు పడే సమయంలో బయటకు వెళ్లకపోవడం ఉత్తమం. ముఖ్యంగా వ్యవసాయ పనులు చేసే వారు, రైతు కూలీలు అప్రమత్తంగా ఉండాలి. ఆకాశంలో మెరుపులు, ఉరుములు వస్తుంటే చెట్ల కిందకు, విద్యుత్ టవర్‌ల కిందకు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లవద్దు. వ్యవసాయ పనులు చేసేటప్పుడు ఉరుములు, మెరుపులు వస్తుంటే పిడుగులు పడతాయని భావించి రైతులు మరింత జాగ్రత్తగా ఉండాలి. వెంటనే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. వీలు కాకపోతే సమయస్ఫూర్తితో ఉండాలి. మోకాళ్లపై చేతులు, తల పెట్టి దగ్గరగా ముడుచుకొని కూర్చోవాలి. దీనివల్ల సమీపంలో పిడుగు పడినా అందులో విద్యుత్ ప్రభావం తక్కువగా పడి బతికే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పిడుగు పడే అవకాశాలు ఉన్నాయన్నపుడు రబ్బర్ చెప్పులు వేసుకోవడం మంచిది. వేసుకోలేని పరిస్థితి ఉన్నప్పుడు కాళ్లు భూమి మీద పూర్తిగా ఆనించకుండా కాలి వేళ్ల మీద నిల్చునేందుకు ప్రయత్నించాలి.

తీపి పంచని మామిడి



- పెట్టుబడులు ఎక్కువ.. ఆదాయం తక్కువ
- కాత సమయంలోనే తోటలు విక్రయం
- విక్రయించిన ధరకు, మార్కెట్ ధరకు భారీ వ్యత్యాసం
- దళారుల చేతుల్లో దగాపడుతున్న మామిడి రైతులు

తోపుడు బండ్లపై నోరూరించేలా కనిపించే మామిడి పండ్లను ధర ఎంతైనా సరే చెల్లించి ప్రజలు కొంటారు. తోపుడు బండ్ల వ్యాపారు అమ్మే ధరను చూసి మామిడి పండ్లను ఉత్పత్తి చేసే రైతులు మాత్రం అవాక్కవుతున్నారు. దళారులకు విక్రయించిన ధరకు, మార్కెట్‌లో ఉన్న ధరకు భారీగా వ్యత్యాసం ఉండడమే ఇందుకు కారణం. దీంతో నోరూరించే పండ్లను ఉత్పత్తి చేసే తమకు చేదే మిగులుతున్నదని మామిడి రైతులు ఆవేదన చెందుతున్నారు.

జహీరాబాద్, మే 22: అకాల వర్షాలు, వర్షాలలేమి ప్రభావంతో పంటను పండించడం ఒక ఎత్తైతే, మామిడి పండ్లను అమ్ముకోవడం రైతులకు మరో సమస్యగా తయారైంది. మామిడి కాయలను కోసి వాటిని మగ్గబెట్టి, మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించడం సమస్యగా భావించి రైతులు నేరుగా తోటలను కాత సమయంలోనే అమ్మేస్తారు. మార్కెటింగ్, అకాల వర్షాలు తదితరాలను దృష్టిలో పెట్టుకుని పండ్లను మార్కెట్‌కు తరలిస్తే వచ్చే లాభ, నష్టాలను బేరీజు వేసుకుని, ఎకరాకు ఎంతో కొంతగా నిర్ధారించుకుని మామిడి తోటలను కాత సమయంలోనే నేరుగా దళారులకు విక్రయిస్తారు. దీంతో వచ్చినదాంతో రైతులు తృప్తి చెందగా, దళారులు మాత్రం భారీగా లబ్ధిపొందుతున్నారు.

ఎకరా సాగుకు రూ.2లక్షల ఖర్చు

జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో మామిడితోటలను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. సుమారు వంద రకాల మామిడి ఉండగా ఇక్కడి రైతులు అన్ని రకాల మామిడి పండ్లను సాగు చేస్తున్నారు. ఎకరా పొలంలో మామిడితోటను సాగు చేస్తే ఐదేళ్ల తర్వాత కాతవచ్చే సమయం వరకు సుమారు రూ.2లక్షలకు పైగానే పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. మొదటి ఏడాది ఎకరా పొలంలో సగటున 60నుంచి 80 మొక్కలను నాటుతారు. మొక్కకు మొక్కకు 20 అడుగుల దూరంలో నాటుతారు. మొదటి సంవత్సరంలో డ్రిప్, మొక్కలు, దుక్కులు తదితరాలు కలిపి సుమారు రూ.80వేల వరకు ఖర్చు అవుతుంది. మరో నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.30వేల చొప్పున రూ.1.20లక్షల పైచిలుకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. వీటికి తోడు ఏటా ఎకరాకు రూ.30వేల పైచిలుకు చెట్లు ఉన్నంతవరకు సస్యరక్షణచర్యలకు ఖర్చులు చేస్తారు.

10వేల ఎకరాల్లో మామిడితోటలు

జహీరాబాద్ నియోజకవర్గంలో ఏటా మామిడి పంట సాగు విస్తీర్ణం పెరుగుతున్నది. 2020-21లో 7,300 ఎకరాల్లో సాగయితే.. 2021-22లో 7వేల ఎకరాల్లో, 2022-23లో 7,500 ఎకరాలు, 2023-24లో సుమారు 10వేల ఎకరాలకు మామిడిపంట సాగు విస్తరించింది. ప్రభుత్వం సహకరిస్తే పంట సాగు మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.





జహీరాబాద్ మార్కెట్‌లో మామిడి పండ్లను విక్రయిస్తున్న వ్యాపారులు

ఎకరాకు రూ.25-30వేల చొప్పున విక్రయం

మామిడి చెట్టు జీవితకాలం 40 సంవత్సరాలుంటుంది. ఒక్కో చెట్టుకు సగటున 350-800 వరకు కాయలుంటాయి. ఎకరాకు 150-250 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ప్రాసెసింగ్ తదితరాల విషయంలో రైతులు రిస్క్ తీసుకోకుండా కాత సమయంలో మామిడితోట్లను నేరుగా దళారులకు ఎకరాకు రూ.25-30వేల చొప్పున అమ్ముతుంటారు. మామిడిపండ్లు కిలో రూ.30చొప్పున మార్కెట్‌లో విక్రయిస్తే ఒక్క టన్నుకు రైతుకు ఏడాదికి ఒక ఎకరాకు రూ.40 నుంచి రూ.45 వేల వరకు ఆదాయం వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో మామిడి పండు ధర కిలోకు రూ.50-100 వరకు ఉన్నది.

జహీరాబాద్ మార్కెట్‌కు ప్రతిరోజు 100 టన్నులు

జహీరాబాద్ పట్టణంలోని ఎడ్ల బజార్‌లో గల మార్కెటింగ్ దుకాణ సముదాయాల్లో 28మంది లైసెన్సులు పొందిన పండ్ల వ్యాపారులు ఉన్నారు. ప్రతి సీజనకు సంబంధించిన వివిధరకాల పండ్లు ప్రతి రోజు ఈ మార్కెట్‌కు వస్తాయి. ప్రస్తుతం మామిడిపండ్ల సీజన్ కావడంతో రైతుల వద్ద తోటలను కొనుగోలు చేసిన దళారులు(వ్యాపారులు) ప్రతిరోజు జహీరాబాద్ మార్కెట్‌కు సుమారు 100 టన్నులకు పైగానే మామిడి పండ్లను తీసుకువస్తారు. కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన వ్యాపారులు సైతం ఇక్కడికి మామిడిపండ్లను, తీసుకురావడం, ఇంకొందరు చిరువ్యాపారులు ఇక్కడి నుంచి వేలంలో పాటపాడి తిరిగి అక్కడికి తీసుకెళ్లడం సహజమే. సుమారు టన్ను ఒక్కంటికి రూ.35వేలు మార్కెట్‌లో ధర ఉండగా, 100 టన్నులకు గాను జహీరాబాద్ మార్కెట్‌లో రూ.3నుంచి రూ.4లక్షల వరకు అమ్మకాలు జరుగుతుంటాయి. మధ్యదళారులు తీసుకువచ్చిన పండ్లను స్థానికంగా ఉన్న చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు వాటిని తీసుకెళ్లి కిలో రూ.50-100 వరకు అమ్ముతుంటారు. దీంతో రైతులకు పెద్దగా ప్రయోజనం లేక పోయినప్పటికీ మధ్యదళారులు, చిరువ్యాపారులు రెట్టింపుస్థాయిలో ప్రయోజనం పొందుతున్నారు.

రూ.2లక్షలకే తోటలను అమ్ముతున్నా



తొమ్మిదెకరాల్లో నాలుగైదు రకాల మామిడితోటలను వేశాను. ఏటా కాత సమయంలో సుమారు సుమారు రూ.2లక్షలకే తోటలను అమ్ముతున్నా. ప్రాసెసింగ్, తదితరాలతో ఇబ్బందులు పడేకంటే కాతసమయంలో అమ్ముకుంటే కొంత మేరకు ప్రయోజనం ఉంటుంది. ప్రాసెసింగ్ చేసి పండ్లను మార్కెట్‌కు తరలిస్తే రెట్టింపు స్థాయిలో లబ్ధిపొందే అవకాశంతో పాటు నష్టం కూడా జరిగే అవకాశం ఉంటుంది. అయితే ఎకరాకు సగటున రూ.50వేల వరకు వస్తే మరింత ప్రయోజనం ఉంటుంది.

– రాజ్‌కుమార్ దేశ్‌పాండే, రైతు, మనియార్‌పల్లి, కోహీర్

రైతులు గ్రూప్‌గా ఏర్పడి ప్రాసెసింగ్ చేస్తే ప్రయోజనం



రైతులు గ్రూప్‌గా ఏర్పడి మామిడిని ప్రాసెసింగ్ చేస్తే అన్ని విధాలుగా ప్రయోజనం ఉంటుంది. మామిడిని పండ్ల కోసమే కాకుండా ఆమ్‌చూర్, తదితర విధాలుగా తయారుచేసి విక్రయిస్తే బాగుంటుంది. మామిడిపండ్లను సుమారు రెండు నెలల పాటు నిల్వచేసే అవకాశం ఉంటుంది. ఈ మేరకు రైతులకు సహకరించే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నం.

– శైలజ, ఉద్యానశాఖ అధికారిణి

ఖరీఫ్ సీజన్‌లో రైతులు పొలాల్లో

యాజమాన్య పద్ధతులను పాటించాలి



జాంగారిబౌలి తండాలో మహిళా రైతులకు ఎరువుల తయారీపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్, మే 22: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పొలాల్లో యాజమాన్య పద్ధతులను పాటించాలని డీడీఎస్-కేవీకే (డెక్కన్‌డెవలప్‌మెంట్ సొసైటీ-కృషివిజ్ఞాన కేంద్రం) శాస్త్రవేత్తలు తదితరులు పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు పొలాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై బుధవారం సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం జాంగారిబౌలి తండాలో మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పొలాల్లో భూసార పరీక్షలను తప్పకుండా చేయించాలని సూచించారు. భూసార పరీక్షల నివేదిక ఆధారంగా ఏ రకమైన పంటవేస్తే బాగుంటుందనే విషయంపై రైతులకు అవగాహన వస్తుందన్నారు. భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు పొలాల్లో కార్డును ఇస్తామని, దాని ఆధారంగా ఎరువులను ఏ విధంగా వాడాలనే అంశంపై అవగాహన వస్తుందన్నారు. రైతులు పొలాల్లో సేంద్రీయ ఎరువులనే వాడాలని సూచనలు చేశారు. అలాగే సేంద్రియ ఎరువుల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. అందులో భాగంగా ఘన, ద్రవ జీవామృతం తయారీ, దశపర్ణికషాయం, బ్రహ్మాస్త్రం తదితర పిచికారి ఎరువుల తయారీ విధానాన్ని రైతులకు నేర్పించారు. రైతులకు పంటలసాగు తదితరాలపై అవగాహన ఉన్నప్పటికీ అధికారుల, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తప్పకుండా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, డీడీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దుకాణాల్లో సబ్సిడీ విత్తనాలు

- రైతు నేస్తంలో మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్



రామాయంపేటలో ఫర్టిలైజర్ షాప్‌ను తనిఖీ చేస్తున్న గోవింద్

రామాయంపేట, మే 22: ఫర్టిలైజర్ దుకాణాల్లో సబ్సిడీపై విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ తెలిపారు. ప్రస్తుతం విత్తనాలకు ఎలాంటి కొరత లేదన్నారు. బుధవారం రామాయంపేట రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. డిమాండ్‌కు సరిపోయేలా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 3,73,509 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుకు అంచనా వేసినట్లు వెల్లడించారు. అలాగే వర్షాలు కురుస్తున్నాయని రైతులు తొందరపడవద్దని, ఇపుడు భూమిలో తేమ శాతం తక్కువగా ఉన్నదని వివరించారు. అంతకు ముందు మండల అధికారి రాజ్ నారాయణతో కలిసి ఫర్టి లైజర్ దుకాణాలను తనిఖీ చేశారు.

ప్రకృతి రక్షణతోనే జీవవైవిధ్య పరిరక్షణ సాధ్యం

మెదక్ అర్బన్/కంది, మే 22: ప్రకృతి రక్షణతోనే జీవవైవిధ్య పరిరక్షణ సాధ్యమని మెదక్ అదనపు కలెక్టర్ రమేష్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవాన్ని విద్యార్థినులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవ జాతుల్లో గొప్పది మానవజన్మ అని, మిగిలిన జీవరాశులను పోషించి, రక్షించాల్సిన బాధ్యత మానవునిదేనన్నారు. మానవుడి మనుగడ జీవవైవిధ్యంపై ఆధారపడిందన్నారు. మొక్కలు నాటడంతో పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందని చెప్పారు. భావి భారత పౌరులుగా విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాధాకిషన్, జడ్పీ సీఈవో ఎల్లయ్య డీఎస్‌వో రాజిరెడ్డి, కో ఆర్డినేటర్ సుదర్శన్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు. కంది మండలపరిధిలోని ఇంద్రకరణ్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఎంఎ్ సఎస్ వాణి ఆధ్వర్యంలో జీవ వైవిధ్య సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో జీవ వైవిధ్య కమిటీ జిల్లా కో-ఆర్డినేటర్ వెంకట్ పాల్గొన్నారు.



మెదక్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేష్

విద్యా విప్లవ సృష్టికర్త భాగ్యరెడ్డి వర్మ

- జయంతిలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మే 22: అణగారిన వర్గాలకు మెరుగైన విద్యను అందించి విద్యా విప్లవం సృష్టించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియడారు. భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతి సందర్భంగా బుధవారం మెదక్ కలెక్టరేట్‌లో ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దళిత బాలికల కోసం పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశారన్నారు. దళిత వైతాళికుడిగా ప్రసిద్ధి చెందిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అంటరాని కులాల ఉద్ధరణకై 1911లో మన్యసంఘాన్ని ఏర్పాటు చేసి, ప్రజల్లో సాహిత్యం, హరికథలు, ఉపన్యాసాల ద్వారా చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, జిల్లా బీసీ అధికారి నాగరాజ్‌గౌడ్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మెదక్ కలెక్టరేట్‌లో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ రమేష్, వివిధ శాఖల అధికారులు

పశుగ్రాసం కొరత.. పశుపోషకుల అవస్థలు

- ఇతర ప్రాంతాల్లో కొనుగోలు, తరలింపు

నారాయణఖేడ్, మే 22: ఒక వైపు ఎండల తీవ్రత, మరో వైపు పశుగ్రాసం కొరతతో పశువులను పోషించుకోవడానికి పశుపోషకులు అవస్థలకు గురవుతున్నారు. ఏటా వేసవిలో పశుగ్రాసం కొరత ఏర్పడుతున్నప్పటికీ, ఈ సంవత్సరం ఎండ తీవ్రత అధికం కావడానికి తోడు గ్రాసం కొరత కూడా తీవ్రమైందని పశుపోషకులు అంటున్నారు. ఇటీవలి వరకు రైతులు సంప్రదాయ పంటలైన జొన్న పంటను అధికంగా సాగు చేసేవారు. దీనికి తోడు వరిసాగు చేసే రైతులు పంటను కూలీలతో కోయించే వారు. ప్రస్తుతం జొన్న సాగు కనుమరుగైంది. దీనికి తోడు వరిసాగు చేసిన రైతులు పంట కోతను కూలీల కొరతతో యంత్రాల ద్వారా చేయిస్తుండడంతో, కొరత ఏర్పడుతుందని పలువురు అంటున్నారు. పశుసంవర్ధ శాఖ అధికారుల లెక్కల ప్రకారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఆవులు, ఎద్దులు కలిపి లక్షా 56 వేల 282, గేదెలు లక్షా 68 వేల 995 ఉన్నాయి. మేకలు 4 లక్షల 38 వేల 475 ఉండగా, గొర్రెలు 2 లక్షల 29 వేల 331 ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో పశువులను రక్షించుకోవడానికి నీటి వసతి ఉన్న రైతులు పశుగ్రాసాన్ని ప్రత్యేకంగా సాగు చేసి, పోషించుకుంటుండగా, నీటి వసతి లేని రైతులు ఇతర ప్రాంతాల నుంచి వరి గడ్డిని కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. గ్రాసం కొరత వల్ల వరి గడ్డికి కూడా డిమాండ్ ఏర్పడింది. ఇటీవలి వరకు వరి గడ్డి మోపు రూ.30 నుంచి 40 వరకు లభించేదని, ప్రస్తుతం రూ.వంద నుంచి రూ.150 వరకు పెరిగిందని పశుపోషకులు అంటున్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలోని పశుపోషకులు సరిహద్దుల్లో ఉన్న కామారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వరి గడ్డిని కొనుగోలు చేసి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లపై తెచ్చుకుంటున్నారు. ఈ విషయమై జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ వసంతకుమారిని సంప్రదించగా.. ఇప్పటి వరకు పశుగ్రాసం కొరత లేదని, అయినప్పటికీ ప్రభుత్వం ద్వారా గడ్డి సాగు విత్తనాలను సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ రైతులకు సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలను సరఫరా చేసేందుకు 11 మెట్రిక్ టన్నులు సరఫరా చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించామని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో విత్తనాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ వసంతకుమారి తెలిపారు.



ఇతర ప్రాంతాల్లో కొనుగోలు చేసి, తీసుకువస్తున్న పశుపోషకులు



మంగళవారం నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు

కండువాలు మారుస్తున్న నాయకులు

కుకునూరుపల్లి, మే 22: ప్రభుత్వం మారడంతో పలువురు నాయకులు, కార్యకర్తలు కూడా రోజుకో కండువాను మారుస్తున్నారు. మంగోల్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో ఉండగా, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏమైందో ఏమోగాని బుధవారం గ్రామ మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్ సమక్షంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు.



బుధవారం కాంగ్రెస్ నుంచి తిరిగి బీఆర్ఎస్‌లో చేరిన నేతలు

నర్సాపూర్ చెరువు సమీపంలో కుళ్లిన మృతదేహాలు

- ఒకటి మహిళదిగా, మరొకటి పురుషుడిదిగా గుర్తింపు

నర్సాపూర్, మే 22: మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని రాయరావు చెరువు వద్ద కాగజ్‌మద్దూర్ వెళ్లే మార్గంలో నిర్మానుష ప్రదేశంలో ఓ మహిళ, ఓ పురుషుడి మృతదేహాలు బుధవారం లభ్యమయ్యాయి. వారిని అత్యంత దారుణంగా హత్య చేసి తగులబెట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నర్సాపూర్-కాగజ్‌మద్దూర్ రోడ్డులో రాయరావు చెరువు సమీపంలో కుళ్లిపోయిన స్థితిలో రెండు మృతదేహాలు ఉన్నట్లు అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ పుష్పరాజ్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. రెండు శవాల్లో ఒకటి పురుషుడిదిగా, మరొకటి మహిళదిగా గుర్తించారు. మృతదేహాలు పూర్తిగా కుళ్లిపోయి, దుర్వాసన వస్తుండటంతో ఘటన జరిగి రెండు మూడు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. వారిద్దరిని ఎవరో చంపి, గుర్తుపట్టకుండా ఉండేందుకు పెట్రోల్‌పోసి తగులపెట్టినట్లు మృతదేహాల తీరును బట్టి తెలుస్తోంది. అయితే, ఈ మృతదేహాలు ఎవరివి.. ఎందుకు హత్య చేశారు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్‌టీం వచ్చి ఆధారాలు సేకరించింది.

అవిశ్వాసానికి కసరత్తు

- బొల్లారం మున్సిపల్ చైర్మన్ వర్గంలోని కౌన్సిలర్ అదృశ్యం
- ఇతర కౌన్సిలర్లకు వల వేస్తున్న కాంగ్రెస్?
- అప్రమత్తమయిన బీఆర్ఎస్ వర్గం, హరీశ్‌రావుతో బేటీ
- దైవ దర్శనాలు, క్యాంపుకులకు పయనం

జిన్నారం, మే 22: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అవిశ్వాసాల సెగ సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీని తాకింది. బీఆర్ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం కోసం కాంగ్రెస్ నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల బీఆర్ఎస్ నుంచి ఆరుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరగా.. అవిశ్వాసం కోసం గత నాలుగు రోజులుగా అధికార పార్టీ నాయకులు ఎత్తులు వేస్తున్నారు. చైర్మన్ వర్గానికి చెందిన ఓ కౌన్సిలర్ అదృశ్యం కాగా ఆయన భార్య ఈ నెల 21 పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా తమ కౌన్సిలర్‌ను కాంగ్రెస్ నాయకులే అపహరించారని చైర్‌పర్సన్, కౌన్సిలర్లు అంటున్నారు. ఈ నేపథ్యంలో తమ కౌన్సిలర్లతో కలిసి మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి తాజా పరిణామాలపై చర్చించడంతో మండలంలో మున్సిపల్ అవిశ్వాసం అంశం హాట్ టాపిక్‌గా మారింది.

రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక మున్సిపాలిటీ

రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక మున్సిపాలిటీగా పేరున్న బొల్లారం మున్సిపాలిటీలో అవిశ్వాస అంశం చర్చనీయాంశమైనది. బొల్లారం మున్సిపాలిటీలో 22 మంది కౌన్సిలర్లు ఉండగా గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 17, కాంగ్రెస్-2, బీజేపీ నుంచి 3 కౌన్సిలర్లుగా గెలిచారు. రెండేళ్ల క్రితం ఓ మహిళా కౌన్సిలర్ మరణించగా ప్రస్తుతం 21 మంది ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ కౌన్సిలర్లు ఇద్దరు బీఆర్ఎస్‌లో చేరగా, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఆరుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్‌కు 12 మంది, కాంగ్రెస్‌కు 8 మంది, బీజేపీకి 1 కౌన్సిలర్లు ఉన్నారు. అవిశ్వాసం ప్రతిపాదన నెగ్గటం కోసం 11 మంది సంఖ్యాబలం కావాలి. దీంతో మరో ముగ్గురిని తమ శిబిరంలో చేర్చుకునేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలోనే చైర్‌పర్సన్ రోజారాణి వర్గానికి చెందిన ఓ కౌన్సిలర్‌ను అపహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు కౌన్సిలర్ భార్య తన భర్త కనిపించడం లేదంటూ బీఆర్ఎస్ నాయకులతో కలిసి పీఎస్‌లో ఫిర్యాదు కూడా చేశారు.



రాజకీయ పరిణామాలపై హరీశ్‌రావుతో చర్చలు

బొల్లారంలో అవిశ్వాసం, కౌన్సిలర్లపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల వలతో అప్రమత్తమయిన చైర్‌పర్సన్ రోజారాణి, ఆమె భర్త, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి తమ కౌన్సిలర్లను కాపాడుకునేందుకు రంగంలోకి దిగారు. అదృశ్యమయిన కౌన్సిలర్ భార్యతో పీఎస్‌లో ఫిర్యాదు చేయించి, ఇతర కౌన్సిలర్లను మాజీ మంత్రి హరీశ్‌రావుతో బేటీకోసం తీసుకెళ్లారు. ఈ మేరకు హరీశ్‌రావు మున్సిపాలిటీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చించి, అధికార పార్టీ ఎత్తుగడలకు చిక్కకుండా వ్యవహరించాలనే దిశానిర్దేశం చేశారు. వెంటనే చైర్‌పర్సన్ వర్గం కౌన్సిలర్లతో, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి ఇతర నాయకులు పలు దేవాలయాలు, ఇతర ప్రాంతాలకు క్యాంపుల కోసం తరలివెళ్లారు. దీంతో బొల్లారం మున్సిపాలిటీలో అవిశ్వాసం.. ఎత్తు గడలు మునుముందు ఏ మలుపులు తిరుగుతాయో అనేది చర్చనీయాంశమైనది.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

- మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు
- పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

వెల్దుర్తి, మే 22: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులకు ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని శెట్టిపల్లి, బండపోసన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ఉప్పులింగాపూర్ రైస్‌మిల్లును పరిశీలించారు. ఇప్పటివరకు మండలవ్యాప్తంగా ఎంతమేర ధాన్యం తూకం వేశారని, ధాన్యం కొనుగోలు, తరలింపు వంటి వివరాలను స్థానిక తహసీల్దార్ తులసీరామ్, సొసైటీ సీఈవో సిద్ధయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధైర్యపడవద్దని ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటామన్నారు. బండపోసన్‌పల్లి కొనుగోలు కేంద్రానికి లారీలు రాకపోవడంతో ధాన్యం తరలించడం లేదని రైతులు ఆయన దృష్టి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన లారీల యజమానులతో మాట్లాడి లారీలను బండపోసన్‌పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి పంపాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ జయభారత్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శివసాయి, గణపతి రైస్ మిల్లులను, హస్తాల్‌పూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పరిశీలించారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు

హత్నూర, మే 22: మండల పరిధిలోని శేర్కాన్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు పరిశీలించారు. కొన్నిరోజులుగా ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ రైతులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ సుజాతచౌహాన్, షాజియోద్దీన్, పోమసింగ్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, అక్కడి రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని హత్నూర పీఏసీఎస్ సీఈవో శ్రీనివాస్‌కు సూచించారు.



వెల్దుర్తిలో ధాన్యం సేకరణ, తరలింపు వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకుంటున్న వెంకటేశ్వర్లు

చివరి గింజవరకూ కొనుగోలు చేస్తాం

మాసాయిపేట, మే 22: రైతులకు అధైర్యపడొద్దని చివరి గింజవరకూ కొనుగోలు చేస్తామని ఎంపీటీసీ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు. బుధవారం మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రం వద్ద విలేకరులతో మాట్లాడారు. తడిచిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భూస్వామి, శంకర్, ముఖ, దశరథ పాల్గొన్నారు.

ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలి

పెద్దశంకరంపేట, మే 22: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ప్రకారం రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ డిమాండ్ చేశారు. బుధవారం పేటలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్, మాజీ సర్పంచులు అశోక్, సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.



హత్నూర మండలం శేర్కాన్‌పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పౌర సరఫరాల శాఖ అధికారులు

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

సంగారెడ్డి రూరల్, మే 22: సంగారెడ్డి జిల్లాలో తడిసిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డిలో వ్యవసాయ శాఖ జేడీ నర్సింహారావుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఎం నాయకులు మాణిక్యం, రాజయ్య, నర్సింహారెడ్డి, మల్లేశం తదితరులు ఉన్నారు.

సన్న ధాన్యానికే కాదు.. దొడ్డు రకానికి కూడా బోనస్ ఇవ్వాలి

చిన్నశంకరంపేట, మే 22: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని సన్న ధాన్యానికే కాకుండా దొడ్డు రకానికి కూడా బోస్ ఇవ్వాలని బీఆర్ఎస్ యూత్ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేయడం లేదని ఆరోపించారు.



కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. మండలంలోని కొత్తచెరువుతండా సమీపంలో అయితే మనిషికి తాగే విధంగా ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

- కల్హేర్

మనస్తాపంతో యువతి ఆత్మహత్య



పావని(ఫైల్)

వెల్దుర్తి, మే 22: మనస్తాపానికి గురై యువతి బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. మండల కేంద్రమైన వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరి గ్రామానికి చెందిన కొడె శ్రీనివాస్, యాదమ్మ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. ఇద్దరి కూతుళ్ల వివాహం జరగ్గా.. మూడో కూతురు పావని (18) ఇంటర్ పూర్తి చేసుకుని ఇంటి వద్ద ఉంటుంది. కొద్దిరోజుల క్రితం శ్రీనివాస్‌కు చెందిన వ్యవసాయ పొలం అమ్మగా వచ్చిన రూ.4 లక్షలను పావని వివాహం కోసం దాచిపెట్టాడు. పొలం అమ్మగా వచ్చిన డబ్బుల తమకు ఇవ్వాలని శ్రీనివాస్ తల్లిబాలమ్మతోపాటు చెల్లి మంజుల ఇబ్బందులకు గురిచేయడంతో పాటు తీవ్ర దుర్భాషలాడారు. దీంతో మనస్తాపానికి గురైన పావని బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

చెరువులో స్నానానికి వెళ్లి యువకుడి మృతి



శివకుమార్ (ఫైల్)

జిన్నారం, మే 22: చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఓ యువకుడు మరణించాడు. జిన్నారం ఎస్ఐ విజయ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఐడీపీఎల్ గిరినగర్‌కు చెందిన అవుసలి శివకుమార్(20), స్నేహితులు అక్షయ్, కార్తీక్, గౌతమ్, కరణ్‌తో కలిసి ఈ నెల 20 మెదక్‌లో ఓ వివాహానికి వెళ్లాడు. వివాహం అనంతరం అందరూ ఏడుపాయల దుర్గామాతను దర్శించుకున్నారు. అనంతరం స్నేహితుడి అమ్మమ్మ గారి గ్రామమైన మండలంలోని లక్ష్మీపతిగూడెంకు వచ్చి రాత్రి బస చేశారు. ఈ నెల 21న లక్ష్మీపతిగూడెం సమీపంలోని వావిలాల పీర్లా చెరువులో స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లారు. ఈతరాని శివకుమార్ చెరువులోకి దిగి ఎక్స్‌కవేటర్ తీసిన గుంతలో పడిపోయాడు. విషయాన్ని గమనించిన స్నేహితులు కుటుంబసభ్యులకు తెలియజేశారు. బుధవారం చెరువులో శివకుమార్ మృతదేహం బయటపడగా వెలికి తీశారు. మృతుడి తండ్రి గణపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు...



రాజు(ఫైల్)

చిలప్‌చెడ్, మే 22: మంజీరా నదిలో చేపలు పట్టేందుకు వెళ్లి, వలలో చిక్కుకుని ఒకరు మృతిచెందారు. మండల పరిధిలోని ఫైజాబాద్ గ్రామానికి చెందిన తలారి రాజు(38) బుధవారం ఉదయం పది గంటలకు గ్రామ శివారులోని మంజీరా పరీవాహక ప్రాంతంలో చేపలు పెట్టేందుకు వెళ్లాడు. వల వేస్తున్న క్రమంలో కాలికి తట్టుకుని నీటిలో మునిగిపోయాడు. స్థానికులు కుటుంబీకులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి వచ్చిన వారు స్థానికుల సహాయంతో వెతగా రాజు మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు మానస, మమతలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..

జహీరాబాద్, మే 22: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగుడంపల్లి మండలం మాడ్గి గ్రామానికి చెందిన నగేష్(28) మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం కర్ణాటకలోని మన్నెల్లి గ్రామంలో పనులను ముగించుకుని రాత్రి 10 గంటల సమయంలో గ్రామానికి వచ్చేందుకు మాడ్గి చౌరస్తాకు వచ్చి 65వ జాతీయ రహదారిని దాటుతున్నాడు. ఈ క్రమంలో జహీరాబాద్ వైపు నుంచి ముంబయి వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే ఆదే గుర్తు తెలియని వాహనం ముందు వెళ్తున్న మరో ఆటో ఢీకొట్టిందన్నారు. ఆటోడ్రైవర్ ఎండీ అసన్‌ఖాన్‌కు కాలు విరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

లారీని ఢీకొని భర్త మృతి, భార్యకు గాయాలు

మెదక్ అర్బన్, మే 22: ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొని భర్త మృతిచెందగా.. భార్యకు గాయాలైన సంఘటన బుధవారం మెదక్ మండల పరిధిలోని మంబోజిపల్లి సమీపంలో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం మేరకు... వెల్దుర్తి మండల పరిధిలోని దామరంచ గ్రామానికి చెందిన శంభు నర్సింహులు(24) భార్య మౌనిక, తల్లి ఎల్లవ్వతోపాటు కూతురు పుట్టు వెంట్రుకల కోసం నూతన వస్త్రాలు కొనుగోలు చేసేందుకు మెదక్ పట్టణానికి వచ్చారు. షాపింగ్ పూర్తి చేసుకుని తిరిగి గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. మంబోజిపల్లి ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఆగి ఉన్న సిమెంట్ లోడ్ లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నర్సింహులు అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య మౌనిక, తల్లి ఎల్లవ్వకు గాయాలయ్యాయి. మౌనిక పరిస్థితి విషమంగా ఉండడటంతో వైద్యులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబీకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

అల్లీనగర్ భామనికుంట నుంచి మట్టి అక్రమ రవాణా

జిన్నారం, మే 22: గడ్డపోతారం పంచాయతీ అల్లీనగర్ భామనికుంట నుంచి మట్టిని అక్రమంగా తవ్వుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఉపసర్పంచ్ మమతావెంకటేష్ అన్నారు. స్థానిక 27 సర్వే నెంబరులో పరిశ్రమల కోసం కేటాయించిన స్థలంలోని కుంటలో మట్టిని అక్రమంగా తవ్వుతూ లక్షలు దండుకుంటున్నారని పేర్కొన్నారు. పరిశ్రమల కోసం సేకరించిన భూముల్లో కొంతమేర కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా.. పరిహారం ఇవ్వకుండా నిర్మాణాలు జరుపుతున్నారని తెలిపారు.

చెట్లను నరకడం తగదు: ఎంపీపీ ఉపాధ్యక్షుడు

జిన్నారం, మే 22: హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షిస్తుంటే.. వాటిని విద్యుత్ అధికారులు తీగలకు అడ్డు వస్తున్నాయని నరికేయడం తగదని ఎంపీపీ ఉపాధ్యక్షుడు గంగు రమేష్ అన్నారు. బుధవారం లక్ష్మీపతిగూడెం నుంచి ఎస్టీ గురుకుల పాఠశాల మధ్య రహదారికి ఇరువైపులా గల భారీ చెట్లను విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్నాయని అధికారుల ఆదేశాలతో నరికేశారన్నారు. గత మండల సభలోనే అధికారులకు తెలియజేసినా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

హవేళిఘణపూర్, మే 22: విద్యార్థులు వేసవి క్రీడల శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజు తెలిపారు. బుధవారం మండలంలోని భూర్గుపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న వేసవి క్రీడల శిక్షణా శిబిరాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులు ఎండలో తిరుగుతూ, సెల్‌ఫోన్లతో ఆడుతూ విలువైన సమయాన్ని వృధా చేయకుండా ఉండేందుకు వేసవి క్రీడల శిబిరం దోహదపడుతుందన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీలకు రిజర్వేషన్ ఇవ్వాలి'

కొల్చారం, మే 22: కొల్చారం మండలం ఎనగండ్ల గ్రామపంచాయతీని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలని నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి ఎనగండ్ల గ్రామ దళిత సంఘం నాయకుడు బాబు బుధవారం మెమోరాండం అందజేశారు. గ్రామపంచాయతీ వ్యవస్థ ఏర్పాటు నుంచి సర్పంచ్ కానీ, ఎంపీటీసీ కానీ ఎస్సీ రిజర్వేషన్ రాలేదని, ఓసీలు, బీసీలు మాత్రమే పదవులు అనుభవిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్‌కు, డీపీవోకు గ్రీవెన్స్‌లో మెమోరాండం అందజేశామని తెలిపారు.

ఐదు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నారాయణఖేడ్/రామచంద్రాపురం, మే 22: నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని ఐదు 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు గురువారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ నాగేందర్ కుమార్ తెలిపారు. విద్యుత్ తీగల వెంట ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామని, అందువల్ల వాసర్, ర్యాకల్ అబ్బెంద, చాప్టాకె, తడ్కల్, సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. అలాగే రామచంద్రాపురం మండలంలోని మయూరినగర్, కాకతీయనగర్, బీరంగూడ పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 12:30 వరకు, రామచంద్రాపురంలో మధ్యాహ్నం 1:30 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ సంజీవరావు తెలిపారు.

సమాచారం

కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేత

నారాయణఖేడ్, మే 22: కంగ్టి మండలం గాజుల్‌పాడ్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సలీం ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఆయనకు బీఆర్ఎస్ సభ్యత్వం ఉన్నందున రూ.2 లక్షల బీమా మంజూరైంది. ఆ చెక్కును మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బుధవారం నారాయణఖేడ్‌లోని పార్టీ కార్యాలయంలో అందజేశారు.

పచ్చిరొట్ట సాగుతో నేల భౌతిక స్థితి మెరుగు

నిజాంపేట, మే 22: పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసుకుంటే నేల భౌతిక స్థితి మెరుగుపడి గుల్లగా మారుతుందని మండల ఇన్‌చార్జి ఏవో రాజ్‌నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో బుధవారం పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు.

బొల్లారంలో అక్రమ నిర్మాణాలపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు

జిన్నారం, మే 22: బొల్లారం మున్సిపాలిటీలోని 75 సర్వే నెంబరులో అక్రమ నిర్మాణాలపై కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ యూత్ పట్టణ అధ్యక్షుడు ఇమ్రాన్ తెలిపారు.

'చిటుకు వ్యాధి వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి'

నారాయణఖేడ్, మే 22: గొర్రెలు, మేకలపంపకం దారులు చిటుకు వ్యాధి వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ వసంతకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఈనెల 30 వరకు చిటుకు రోగం నివారణకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, గొర్రెలు, మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మెదక్ గడ్డపై కాషాయపు జెండా ఎగరడం ఖాయం

గుమ్మడిదల, మే 22: ఈ పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో మెదక్ గడ్డపై కాషాయపు జెండా ఎగరవేయడం ఖాయమని బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి చెన్నంశెట్టి ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారతదేశ గతిని మార్చిన ప్రధాని మోదీ పదేళ్లలో చేసిన అభివృద్ధికి రెఫరెండంలాంటిది అన్నారు.

నేడు జనుము విత్తనాలు పంపిణీ

ఝరాసంగం, మే 22: నేడు ఝరాసంగంలోని రైతు ఆగ్రోస్ కేంద్రంలో జనుము విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 100 క్వింటాళ్ల జనుములు అందుబాటులో ఉన్నాయని, సబ్సిడీపోను 40కిలోల బస్తాను రూ.1,448లకు ఇస్తామన్నారు.

27లోపు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ట్రైడెంట్ యాజమాన్యాన్ని ఆదేశించిన కలెక్టర్ వల్లూరి క్రాంతి

జహీరాబాద్, మే 22: జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో గల ట్రైడెంట్ కర్మాగారం కార్మికుల పెండింగ్ వేతనాలను ఈనెల 27వ తేదీలోపు చెల్లించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి పరిశ్రమ ఎండీ.రామ్‌నాథ్‌ను, సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సంగారెడ్డిలోని కలెక్టరేట్ కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులు, ఎండీ.రామ్‌నాథ్, జిల్లా కార్మికశాఖ అధికారులు, చక్కెరశాఖ అధికారుల సమక్షంలో చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి ఒప్పందాలు గతంలో కూడా కుదిరాయని, యాజమాన్యం మొండికేయడమేంటని ఎండీని ప్రశ్నించారు. కర్మాగారం యజమాని కార్మికుల వేతనాలు, పీఎఫ్, గ్రాట్యూటీ, ఎల్ఐసీ, ప్రీమియం బకాయిలు ఈనెల 27లోపు చెల్లించాలన్నారు. మూడునెలలకు సంబంధించి వేతనాలు చెల్లించేందుకు ఎండీ అంగీకరించాడని, మిగతాది కూడా త్వరలో చెల్లించాలని ఆదేశించామని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ ఉప కమిషనర్ రవీందర్‌రెడ్డి, చక్కెరశాఖ అధికారి రాజశేఖర్, కార్మిక సంఘం నాయకులు హుగ్గెల్లి రాములు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆధ్వర్యంలో చర్చలు జరుపుతున్న కార్మికులు, యాజమాన్యం

ఖాతాదారులకు మెరుగైన సేవలు: నర్సింహారెడ్డి

సంగారెడ్డి రూరల్, మే 22: జాతీయ బ్యాంకులకు దీటుగా తమ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నామని కాకతీయ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ నర్సింహారెడ్డి అన్నారు. బ్యాంకు స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని కాకతీయ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీఐ అనుమతితో డీఐసీజీసీ సౌకర్యం గల అత్యధిక వడ్డీ ఇచ్చే ఏకైక బ్యాంకు అని తెలిపారు. సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా 37 నెలలకుగాను రూ.10 లక్షలకు 10 శాతం వడ్డీ ఇస్తున్నామన్నారు. అదేవిధంగా బ్యాంకులో లాకర్ సౌకర్యం, బంగారు ఆభరణాలపై రుణాలు, గృహ రుణాలు, మార్టిగేజ్ రుణాలు అందిస్తున్నామని చెప్పారు. విశ్రాంత ఉద్యోగులకు మంచి అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం చిరువ్యాపారులకు రుణాలు అందజేశారు. బ్యాంకు రీజినల్ మేనేజర్ వివి. గోపాల్, బ్యాంచ్ మేనేజర్ మొగులయ్య, అసిస్టెంట్ మేనేజర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



కాకతీయ బ్యాంకులో చిరువ్యాపారికి లోన్‌కు సంబంధించిన చెక్కును అందజేస్తున్న నర్సింహారెడ్డి

కనుల పండువగా నృసింహ కల్యాణోత్సవం

తూప్రాన్, మే 22: తూప్రాన్ పట్టణ శివారులోని రామాలయం వద్దగల పురాతన శ్రీకూర్మ (కప్పెర) నర్సింహాస్వామి జయంతి, 41వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడురోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో చివరిరోజైన బుధవారం స్వామివారి తిరు కల్యాణమహోత్సవం కనుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా దేవతారాధన, సుదర్శన హోమం, పూర్ణాహుతి, స్వామివారి తిరు కల్యాణమహోత్సవం, ఓడి బియ్యం, మంగళహారతులు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. మత్స్యశాఖ జిల్లా డైరక్టర్ గడప దేవేందర్ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కల్యాణోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



తూప్రాన్‌లో నృసింహ కల్యాణోత్సవంలో మున్సిపల్ చైర్మన్ దంపతులు

చీలపల్లిలో ఘనంగా అమ్మవారికి బోనాలు

పెద్దశంకరంపేట, మే 22: పెద్దశంకరంపేట మండల పరిధిలోని చీలపల్లిలో దుర్గమ్మ జాతరను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం అమ్మవారికి మహిళలు బోనాలను సమర్పించారు. భాజాభజంత్రీలతో గ్రామంలోని పురవీధుల గుండా బోనాలు నెత్తిన పెట్టుకొని, శివశక్తుల నృత్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి దుర్గమ్మతల్లి బోనాలను నివేదించారు.

వైభవంగా దుర్గామాత వార్షికోత్సవాలు

నారాయణఖేడ్, మే 22: ఖేడ్ పరిధిలోని మండల కేంద్రమైన నిజాంపేటలో దుర్గామాత ఆలయ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా కొనసాగాయి. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అలంకరణ, హారతి కార్యక్రమాలు నిర్వహించగా, సాయంత్రం బండ్ల ప్రదర్శన నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

హోరాహోరీగా కుస్తీ పోటీలు

నారాయణఖేడ్, మే 22: మండల పరిధిలోని లింగాపూర్‌లో లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ఈ పోటీల్లో చిన్నారుల నుంచి యువకుల వరకు పాల్గొన్నారు. నిర్వాహకులు పోటీ స్థాయిని బట్టి విజేతలకు బహుమతులు అందించారు. చివరి కుస్తీలో విజయం సాధించిన మల్లయోధుడికి మూడున్నర తులాల వెండి కడియాన్ని అందజేశారు.

కేతకీ హుండీ ఆదాయం రూ.26.53 లక్షలు



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

ఝరాసంగం, మే 22: దక్షిణకాశీగా పేరొందిన కేతకీ సంగమేశ్వరస్వామి హుండీని బుధవారం లెక్కించారు. 67 రోజులకుగాను రూ.26.53 లక్షల పైచిలుకు ఆదాయం వచ్చింది. దేవాదాయ, ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీ ద్వారా వచ్చిన ఆదాయంతో ఆలయాభివృద్ధికి ఖర్చులు చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శశిధర్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

'వైకుంఠధామాలు, నర్సరీల నిర్వహణ సక్రమంగా ఉండాలి'

కంది, మే 22: వైకుంఠధామాలు, నర్సరీల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. కంది మండల పరిధిలోని కాశీపూర్, కలివేముల గ్రామాల్లో వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాలు, డంపింగ్‌యార్డులు, నర్సరీలు క్రీడా ప్రాంగణాలను బుధవారం పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మారెడ్డి, ప్రభాకర్ ఉన్నారు.

డిఫెన్స్ ఉద్యోగుల ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాలోజి

కంది, మే 22: మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో డిఫెన్స్ ఉద్యోగుల ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాలోజి బుధవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఓఎఫ్ఆర్ఈయూ నాయకులు మణిందర్‌రావు అధ్యక్షతన అభినందన సభ జరిపారు. బాలోజి కొన్నేళ్లుగా ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ నాయకుడిగా శ్రమించడం చూసి జాతీయ నాయకత్వం అయనను జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఓబీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాండు మాట్లాడుతూ బాలోజి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పక్షాన పోరాడాలని ఆకాంక్షించారు.

క్రీడలతో దేహదారుఢ్యం: రాజిరెడ్డి

వెల్దుర్తి, మే 22: క్రీడలతో మానసిక వికాసంతో పాటు దేహదారుఢ్యం పెంపొందుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కుకునూర్‌లో బుధవారం జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపులో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులను అందజేసి మాట్లాడారు. క్రీడాకారులు మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత్ పెట్రోల్ బంక్‌లో మోసం

- సిబ్బందిని నిలదీసిన వినియోగదారులు

శివ్వంపేట, మే 22: పెట్రోల్ బంక్‌లో వినియోగదారులను మోసం చేస్తున్నారని బంక్ సిబ్బందిపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన బుధవారం శివ్వంపేటలో చోటుచేసుకున్నది. మండల కేంద్రమైన శివ్వంపేటలోని భారత్ పెట్రోల్ బంక్‌లో శివ్వంపేటకు చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో పెట్రోల్ పోయించుకోగా అనుమానం వచ్చింది. వెంటనే వాటర్ బాటిల్‌లో పెట్రోల్ పోయించారు. కాగా 60 మిల్లీమీటర్ల పెట్రోల్ తక్కువ రావడంతో పెట్రోల్ బంక్ సిబ్బందిని నిలదీశారు. తూనికల కొలత అధికారుల పర్యవేక్షణ లోపంతో పెట్రోల్ బంక్ సిబ్బంది వినియోగదారులను మోసం చేస్తున్నారని, అధికారులు స్పందించి పెట్రోల్ బంక్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగిపడిన విద్యుత్ స్తంభం

చిలప్‌చెడ్, మే 22: ట్రాన్స్‌ఫార్మర్‌పై విద్యుత్ స్తంభం విరిగిపడినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొన్నారు. మండల పరిధిలోని అజ్జమరి గ్రామ శివారులో రెండురోజుల క్రితం వచ్చిన ఈదురుగాలులకు ట్రాన్స్‌ఫార్మర్‌పై విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఈ విషయం అధికారులకు తెలిపినా ఎలాంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని తెలిపారు.

24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి

- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, మే 22: రైతుల నుంచి కొనుగోలు చేసిన జొన్నలకు, ధాన్యానికి 24 గంటల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బీబీపేట్‌లో నిర్వహిస్తున్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించి మాట్లాడారు. మండలంలోని ఇతర గ్రామాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తాము నేడు జరుపతలపెట్టిన ఆందోళనకు భయపడిన కాంగ్రెస్ నాయకులు రాత్రికిరాత్రే కల్హేర్, మార్డి, క్రిష్ణాపూర్ గ్రామాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని తెలిపారు. అనంతరం మాసాన్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు దాడిలో గాయపడిన బైండ్ల అంజయ్యను ఆయన పరామర్శించారు. ఆయన వెంట కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.అలీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంసింగ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ దిలీప్‌కుమార్, నాయకులు ఉన్నారు.

నిజాలు తెలుసుకోకుండా మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు

జొన్నల కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి నిజాలు తెలుసుకోకుండా అసత్యపు ఆరోపణలు చేయడం తగదని, అనుమతులు లేకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని అంటున్న ఆయన అధికారులచే నిజాలు తెలుసుకొని మాట్లాడాలని సీడీసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, కల్హేర్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎం.వీరశెట్టి, కాంగ్రెస్ నాయకులు మల్డొడ్డి తుకారాం, జితేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం వారు కల్హేర్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు పన్నెండున్నర క్వింటాళ్లు కొనుగోలు చేస్తామని హామీఇవ్వడంతో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి రైతులకు ప్రయోజనం కలుగడం కోసం కొనుగోలు కేంద్రాలను కొంత ఆలస్యంగానే ప్రారంభించాలని సూచించారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాకు భయపడి కేంద్రాలను ప్రారంభించారని అంటున్న మాజీ ఎమ్మెల్యే ఒకసారి మార్క్‌ఫెడ్ డీఎంను, ఐకేపీ డీపీఎంను తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు.



బీబీపేట్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న భూపాల్‌రెడ్డి